


# ఆపద్ధర్మం

-సి హెచ్ ఇంద్రాణి

పత్రికలోని ప్రకటనను ఇంకా చూస్తూనే ఉన్నాడు పరంధామయ్య. ఇప్పటికే ఆ ప్రకటనను పాతిక సార్ల పైన చదివాడతను. అయినా మళ్ళీ చదవాలనిపించింది అతనికి....అదేవిటంటే....

'పదకొండో తరగతి చదివే ఓ పదహారేళ్ళ బాలికకు మూత్ర పిండం ఆపరేషన్ నిశ్చయమయింది. పెద్ద మనసుతో విరాళం ఇచ్చే దాతలు మీ విరాళాలు ఈ క్రింది అడ్రస్సుకు పంపండి......'

పదహారేళ్ళకే మూత్ర పిండంలో లోపమా? అందులోనూ ఆడ పిల్ల... ఈ కాలంలో అన్నీ ఉన్న ఆడపిల్లలకు పెళ్ళవటమే అంతంత మాత్రంగా ఉంది. ఇక ఇలాంటి అవక తవకలుంటే ఇంకెలా పెళ్ళవుతుంది? ఆ పిల్ల భవిష్యత్తు ఏం కావాలి?.... ఆలోచిస్తున్నాడు పరంధామయ్య. అతనికి తన భార్య గుర్తుకు వచ్చింది. పెళ్ళయిన పదినెలలకే ఆమెకు కిడ్నీ ఆపరేషన్ అంటే అమెరికా దాకా తీసుకు వెళ్ళాడు. ఆపరేషన్ సక్సెస్... కానీ పేషెంట్ దక్క లేదు. అంత ఖర్చు పెట్టుకుని అమెరికా వెళ్ళొచ్చిందే మిగులు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి పరంధామయ్యకు.

పరంధామయ్యను ఒక లక్షాధికారి అయిన భిక్షాధి కారని చెప్పొచ్చు. అతనికి ఆ ఊర్లో మంచి సెంటర్లో పది గ్రౌండ్లలో ఓ ఇల్లు ఉంది. దాంట్లో దాదాపు యాభై పోర్షన్లు - మధ్య తరగతి వారి కోసం కట్టించాడు. క్రింది భాగంలో ఇరవై కొట్లున్నాయి. పదేళ్ళ క్రితం తను అమెరికా వెళ్ళే సందర్భంలో అందరికీ అద్దెకిచ్చాడు. ఏముహూర్తంలో వారి కద్దెకిచ్చాడో గానీ, ఆ రోజు నుంచి ఇంత వరకు ఎవరి దగ్గర నుండి ఏ నెలా అద్దె అన్నది వసూలు చెయ్యలేకపోయాడు.

అసలు తప్పంతా పరంధామయ్యదనే చెప్పాలి. తండ్రి పోయిన తర్వాత ముందు వెనక ఎవ్వరూ లేరు. గ్రామంలోని ఆస్తులు అమ్ముకుని పట్నానికి వచ్చాడు.

ఆదర్శంగా ఉంటుందని ఓ అనాథ శరణాలయానికెళ్ళి అన్నపూర్ణ అనే ఓ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. పది మందికి పనికొస్తుందని మంచి సెంటర్‌లో స్థలం కొని చిన్న చిన్న పోర్షన్లతో ఈ భవంతి కట్టించాడు. గృహ ప్రవేశ ముహూర్తంతో పాటే భార్య ఆపరేషన్ కోసం ఆమెరికా వెళ్ళే ముహూర్తం కూడా పడింది.

అన్ని పనులూ ఆదరా బాదరా గానే జరిగాయి. ఎవరో బ్రోకరు వచ్చాడు. చాలా మంది మనుషులను తెచ్చాడు. ఒకరు బడి పంతులు, ఇంకొకరు బాంక్ క్లర్క్. ఇంకొకరు పాత సామాన్లు కొనే వ్యాపారి. ఇలా ఇంటికి ఎవరెవరో వచ్చారు. వచ్చిన వాళ్ళకు లేదనకుండా పోర్షన్లు ఇచ్చాడు పరంధామయ్య.

ప్రతివాళ్ళలోనూ "అయ్యా మీరు అద్దె ఇచ్చినా ఇవ్వక పోయినా ఫరవాలేదు గానీ ప్రతిరోజూ ఇల్లు శుభ్రం చేసి ఇంట్లో దీపం వెలిగించండి. అంతే చాలు నాకు" అన్నాడు.

ఆ ఇంట్లోని యాభై పోర్షన్లు ఇట్టే నిండి పోయాయి. బ్రోకరు దాదాపు యాభైవేలు దాకా అడ్వాన్సు అనే పేరుతో వెనకేసుకున్నాడు. బ్యాంకులో ఇంకో కొత్త అకౌంటు ఓపెన్ చేసి బ్రోకరుకూ, తన ఇంట్లో అద్దెకు వచ్చిన వారికి నంబరు ఇచ్చాడు. అందులో అందరి అడ్వాన్సు, నెల నెలా అద్దెలు వెయ్యమని చెప్పి అమెరికాకు విమానం ఎక్కాడు పిచ్చి పరంధామయ్య. అంతా అయి తిరిగి రావటానికి ఆరు నెలలు పట్టింది.

తిరిగి వచ్చిన పరంధామయ్యను పరామర్శించటానికి వచ్చిన తన టెనెంట్సు ఆప్యాయత అతని మనస్సును కరిగించింది. తనింట్లో తన కింతటి సన్నిహితులున్నారా? అని ఉప్పొంగి పోయాడు. భార్య పోయిన దుఃఖంలో ఇంకో ఆరు నెలలు ఎవరినీ పట్టించుకో లేదు.

ఇంకొక పది పదిహేను రోజులకు సంక్రాంతి పండగ. పరంధామయ్య ఆలోచిస్తున్నాడు. తనకా భార్య పోయింది. పండగలూ పబ్బాలు పనికిరావు. కనీసం తన ఇంట్లో ఉండే వాళ్ళన్నా బాగా చేసుకోవాలని - అందుకు వా[illegible]గుగా ఆ ఇంటికి సున్నం కొట్టించి, తలుపులకు పెయింట్ వేయిద్దాం అని బ్యాంక్‌కు బయలుదేరాడు [illegible]

ఆశ్చర్యం.... బ్యాంకులో ఎవరూ ఇంతవరకు ఓ కానీ కూడా జమ కట్ట లేదు. ఆలోచిస్తూ ఇంటికి

వచ్చాడు పరంధామయ్య. ఎవరిని అడిగినా ఏదో ఒక సమాధానం.. ఏదో సాకు.. ఏదో ఒక సంజాయిషీ. లోకంలో కష్టాలు లేని వాడెవడు? అందులోనూ ఇటువంటి అమాయకపు చక్రవర్తి.. పనికి రాని శుంఠ అని తెలిసిన తర్వాత అందరూ తమ తమ తెలివి తేటలను ప్రదర్శించే వారే.

వారితో మాట్లాడటం వల్ల అతనికి తెలిసిన ఒకే ఒక విషయం..... తన ఇంటి కొచ్చిన తర్వాత అందరికి టైం బాగోలేదని వాస్తు ప్రకారం తనదొక దురదృష్టకరమయిన ఇల్లని.. అందువల్లనే తన భార్య పోయిందని.. ఈ గల్లంతులో బ్రోకరు యాభై వేల రూపాయలతో పరారయ్యాడనీ. విధి లేక బాంక్ నుండి డబ్బులు డ్రా చేసి ఇంటికి పెయింట్స్ వేయించాడు తన ఖర్చుతో.

అలాగే ఇంటిపన్ను, వాటర్ టాక్స్, అర్బన్ టాక్స్‌లు కట్టాడు, తన డబ్బుతోనే.

రోజులు గడుస్తున్నాయి పరంధామయ్య బాంకులో ధనం కరిగి పోతున్నది. తన ఇంట్లో ఉండే వారి కల్పనా కష్టాల కథలు పెరిగిపోతున్నాయి. మరీ విసుగెత్తి లేపి అడిగితే ఏ పదో పరకో చేతులో పెట్టే మహానుభావులు లేకపోలేదు.

పరంధామయ్యకు ఏం చెయ్యాలో పాలు పోలేదు. తను అసమర్థుడన్న విషయం వారికి తెలిసిపోయిందని తెలుసుకున్నాడు. తన దగ్గర డబ్బు పూర్తిగా అయిపోయింది. ఇంక డబ్బు కావాలంటే అప్పుచేయాలి లేదా అడుక్కుతినాలి.. అదే.. అద్దెలు వసూలు చేసుకోవాలి. ఆలోచిస్తున్నాడు పరంధామయ్య.

పది సంవత్సరాల తర్వాత జ్ఞానోదయం అయింది పరధామయ్యకు.

తన ఇంట్లో అద్దెకున్న ఒక్కొక్క కొట్టును ఉపయోగించటం మొదలు పెట్టాడు. హొటలులో భోజనం, బట్టల కొట్లో బట్టలు, టైలర్ కొట్లో వాటిని కుట్టించుకోటం, డ్రైక్లీనర్ దగ్గర లాండ్రి బట్టలు, జెనరల్ స్టోర్సులో కావలసిన సామాన్లు తీసుకోవటం....ఇలా.

ఇదీ ఒక విధంగా బాగానే ఉంది. ఒంటరి మనిషి - జీవితం గడిచి పోతున్నది. అందరికీ పరంధామయ్యను చూస్తే పప్పుచారులోని కరివేపాకు లాగా అనిపిస్తున్నది. కానీ అవేం పట్టించుకోకుండా తనదోవలో తాను పోయాడు పరంధామయ్య.

● ● ●

పదే పదే ఆ ప్రకటనను చూస్తున్న పరంధామయ్యకు ఆ పసి పిల్లకు ఎలాగయినా సహాయం చెయ్యాలనిపించింది. కానీ ఎలా?.... అది తెలీక చాలా సతమత మయ్యాడు. జీవితంలో మొట్ట మొదటిసారి తాను అసమర్థుడినని అంగీకరించుకున్నాడు. కానీ ఆ పసి పిల్లకు సహాయం చెయ్యాలనే పట్టుదల మాత్రం పెరుగుతూనే ఉంది అతనిలో...

తన ఇల్లు తాకట్టు పెడితేనో? తాకట్టు అంటే ప్రోనోటులు, పత్రాలు, సాక్షులు, సంతకాలు పైగా నెల నెలా వడ్డీలు కట్టాలి. అసలే ఒక పక్క అద్దెలు వసూలు అవక... ఆదాయమూ లేక... తన ఇంటి కొట్ల మీద పడి బతికే తను వడ్డీలకు ఎక్కడి నుంచి తెస్తాడు డబ్బు? కానీ ఎలాగైనా ఆ పిల్లను ఆదుకోవాలి? ఏం చెయ్యాలి?.... ఏం చెయ్యాలో పాలు పోవటంలా పరంధామ య్యకు.

విసుగుతో పేపరును వెనక్కు తిప్పాడు. వెనకాల ఇంకో ప్రకటన.

కావలెను- "నగరంలో కొత్త పోలీసు కంట్రోలు రూం కట్టడానికి దాదాపు పది గ్రౌండ్లలో స్థలం కావలెను."

ఆలోచించాడు పరంధామయ్య. ఈ రోజు రేటు ప్రకారం తన స్థలం అమ్మితే గవర్నమెంటు రేటు 30 లక్షలు వస్తాయి. దానితో తన కష్టం తీరుతుంది... కానీ తనను నమ్ముకున్న యాభై కుటుంబాలు - ఇరవై షాపులు వీధిన పడతాయే?

### పెళ్ళి ఖర్చు రూ 25 వేలు దాటితే జైలు శిక్ష!

పెళ్ళిళ్ళ ఖర్చు 25 వేల రూపాయలకు మించకుండా పరిమితి విధిస్తూ ఒరిస్సా ప్రభుత్వం ఒక బిల్లును రూపొందించింది. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన 'నేరస్థులకు' జైలుశిక్ష విధించేందుకు అవకాశం కల్పించే అంశాన్ని కూడా ఈ బిల్లులో పొందుపరిచారు. ఈ బిల్లును ప్రవేశ పెట్టడానికి ముందురాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ బిజూ పట్నాయక్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గత నాలుగేళ్ళ కాలంలో దాదాపు 607 వరకట్న మరణాలు నమోదయ్యాయని చెప్పారు. వరకట్న దురాచారంగా ఈ నాలుగేళ్ళలో 198 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆయన తెలిపారు. వరకట్నానికి సంబంధించిన కేసులను విచారణ చేయటంలో కోర్టులు జాప్యం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. ఈ విషయాన్ని అంగీకరించటం కూడా మన జీవన సరళిలో ఒక భాగమై పోయిందని ఆయన అన్నారు. ప్రజల్లో వరకట్నం పట్ల ఉన్న మోజే ఈ దురాచారాన్ని మరింత ఉధృత రూపం దాల్చేలా చేస్తున్నదని ఆయన విమర్శించారు.

—వి.వి

దానికి తాను ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కారకుడవుతాడే? కేవలం డబ్బు కోసం ఇంతటి నీచత్వానికి పాలు పడటమా? తన పెద్దలు వినోబా భావే భూదానోద్యమానికి ఎన్ని ఎకరాలు దానం చేశారు? ఆవంశంలో పుట్టిన తనీ నికృష్టపు పని చెయ్యటమా? అతనిలోని అమాయక అసమర్థుడు సర్ది చెప్పాడు.

కాసేపు బుర్ర గోక్కొని జుట్టు పీక్కున్నాడు పరంధామయ్య. సరే అయితే ఈ పోలీసులకు అమ్మేప్లాను విరమించాలి.. అని ఒట్టు పెట్టుకున్నాడు. కానీ ఆ పత్రికలోని పిల్ల దీనవదనం అతని మనస్సులో మసకగా మెదిలింది. ఆమె ముఖం అతనికి కనపడక పోయినా ఆ కళ్ళల్లోని కన్నీళ్ళు మాత్రం స్పష్టంగా కనిపించాయి. చలించి పోయాడు పరంధామయ్య. వెంటనే ఓ పేపరు పెన్ను తీసుకున్నాడు. 'పోలీస్ కమీషనర్ గారికి... అని మొదలు పెట్టి మీ విధేయుడు అని పరంధామయ్య ముగించాడు. మళ్ళీ తన అసమర్థపు అంతరాత్మ ఆ యాభై కుటుంబాల సంగతేమిటి? అని అదిలించింది. ఆ లెటర్‌ను అక్కడున్న అలమారులో పడేశాడు అసహనంతో.

ఇంతలో అతని బుర్రలో ఓ చిన్న ఆలోచన వచ్చింది. గీతలో చెప్పినట్లు మంచి కోసం చేసే తప్పులో తప్పులేదని చెప్పింది అతని మనస్సు. వెంటనే లేచాడు. అలమారులోని ఆ కాయితాన్ని అందుకున్నాడు. తనింత వరకు ఉపయోగించుకోని ఒకే ఒక కొట్టు టైప్ ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళి తన లెటర్‌ను టైప్ చెయ్యమన్నాడు. ఆ ఓనరు అది చదివి ఆశ్చర్యం... భయంతో.... "ఇదంతా ఇప్పుడెందుకు సార్...." అని నసిగాడు.

"అదంతా నీ కనవసరం. నేను చెప్పింది చెయ్యి. ఇంత దాకా అద్దె అన్న మాట లేకుండా అందరూ ఆనందంగా ఉంటున్నారు. ఈ దెబ్బతో అందరూ రోడ్డుకొస్తారు. తొందరగా కానీయి. నా కవతల చాలా పనులున్నాయి," అన్నాడు.

జీవితంలో ప్రప్రథమంగా చాలా కఠినంగా మాట్లాడాడు పరంధామయ్య. బిక్క ముఖంతో ఆ లెటర్ టైప్ చేసి ఇచ్చాడు ఆ టైపు ఇన్‌స్టిట్యూట్ షాప్ ఓనరు. పరంధామయ్య ఆ లెటర్‌ను చదువుకుని ఒరిజినల్ మీద సంతకం పెట్టి ఓ కవరులో పెట్టాడు. కార్బన్ కాపీని కావాలనే ఆకొట్లో వదిలేసి తన ఇంటి కొచ్చి నిశ్చింతగా నిద్ర పోయాడు.

కానీ అక్కడ ఆ కార్బన్ కాపీని పట్టకుని ఆ ఇన్‌స్టిట్యూట్ ఓనర్ అందరు కొట్ల వారికి చూపించి ఓ చిన్న సైజు జనరల్ బాడీ మీటింగ్ లాంటిది పెట్టాడు. అంత మంచి స్థలం అమ్మటం చాలా సులభం. అందులోనూ కొనే వాళ్ళు పోలీసులు. తమను ఖాళీ చేయించటం కూడా పెద్ద సమస్య కాదు. కానీ అదే స్థలంలో జన్మలో తమకు ఆ అద్దెలో కొట్లు దొరకవు - అని వాళ్ళకు వాళ్ళే మాట్లాడుకుని ఓ తీర్మానానికి వచ్చారు. వెంటనే 20 షాపుల వాళ్ళు పది సంవత్సరాలకు నెలకు యాభై రూపాయల చొప్పున ఒక లక్షా 20 వేలు ఇచ్చి ఇక నుండి నెలకు వంద రూపాయలు అద్దె ఇచ్చేటట్లు తీర్మానించుకున్నారు. అలాగే ఇళ్ళలో అద్దె కుండే యాభై కుటుంబాల వారిని కూడా నెలకు పాతిక రూపాయల చొప్పున పది సంవత్సరాలకు లక్షా యాభైవేలు ఇమ్మని లెక్క తేల్చారు. ఇక నుండి నెలకు 50 రూపాయలు అద్దె ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.

మర్నాడు అందరూ అన్న ప్రకారం డబ్బు తెచ్చి మొత్తం రెండు లక్షలా డెభై వేలు పరంధా మయ్యకిచ్చి ఇల్లు అమ్మవద్దని పదే పదే ప్రాధేయపడ్డారు.

అందరూ వెళ్ళి పోగానే పరంధామయ్య పక్క కింద దాచిన ఆ టైపు చేసిన ఉత్తరాన్ని ముక్కలు ముక్కలు గా చింపి మూలకు విసిరేశాడు. ప్రకటన అడ్రస్ ఉన్న పత్రికను తీసుకుని తన ఇల్లు తాళం పెట్టి గర్వంగా వీధిలోకి నడిచాడు.